
# శృంగార బేతాళ కథ

పాలంకి ఎన్.



ఆదివారం మిత్రులందరం మా యింట్లో సమావేశమయ్యాం. శ్రీమతి లోపల గదిలో నిద్ర పోతోంది. ఆవిడ లేచి కాఫీ, టిఫినూ యిచ్చేదాకా కబుర్లతో కాలక్షేపం చెయ్యాలని నిర్ణయించుకున్నాం.

"కబుర్లకేం కానీ కథ ఏమైనా చెప్పు గురూ!"అన్నాడు విశాల్.


"నిన్న నేను చూసిన సినిమా కథ చెప్పనా?" అన్నాడు విశ్వనాథ్.

"సినిమాల్లో కథలుంటాయేమిటి? అమ్మాయీ, అబ్బాయీ ప్రేమించుకుంటారు. అన్ని ఆటంకాలనూ దాటి పెళ్లి చేసుకుంటారు. లేదా అమ్మాయీ, అబ్బాయీ పెళ్లయ్యాక అనుమానాలతో బాధ పడతారు. అపార్థాలు తొలగిపోయి సుఖంగా వుంటారు"అన్నాడు విశాల్.

విశ్వనాథ్ చిన్నబుచ్చుకున్నాడు. నేను పరిస్థితిని సర్దటానికి "నేను ఒక సంస్కృతపద్యం చదివాను. మీకు చెప్తాను" అన్నాను. "నాకు పద్యాలూ, శ్లోకాలూ అర్థం కావు. కథ చెప్పు" అన్నాడు లోకేశ్.

"ఆ పద్యం తాలూకు కథ చెప్తాను వినండి అనగనగా ఒక రాజు. ఆ రాజుకు ఏడుగురు భార్యలు..."

విశాల్ అందుకుని, "ఏడుగురు భార్యలూ షాపింగుకు వెళ్లి ఏడు చీరలు కొనుక్కున్నారు. అందులో ఒక చీర మొదటి వాష్‌కే వెలిసిపోయింది చీరా చీరా ఎందుకు వెలిసిపోయావు అంటే షాపువాణ్ని అడుగు అంది..." అని నా ముఖంలో కోపం చూసి ఆగిపోయాడు.



"ఎవరైనా అడ్డు తగిలితే నేను చెప్పను!"అన్నాను.

"అడ్డు తగలటం లేదు కానీ చిన్న అనుమానం. ఒక్క భార్యను సుఖపెట్టటమే మనకెంత కష్టంగా వుంది కదా! చీరలూ, నగలూ, టీవీ, ఫోనూ... రాజుగారెలా మేనేజ్ చేశాడోయ్?" అడిగాడు కామేశ్.

"రాజు గారు కదా, డబ్బుకు కొదవేమిటి? ఒక్కొక్క రాణికీ ఒక్కొక్క మేడ కట్టించి అన్ని సదుపాయాలూ ఏర్పాటు చేసే వుంటాడు. అందరికీ చీరలూ, నగలూ సమంగా యిచ్చే వుంటాడు. పద్యంలో ఆ వివరాలు లేవు కానీ అంతకన్నా ముఖ్యమైన వివరం వుంది."

మిత్రులు నలుగురూ నా వైపు కుతూహలంగా చూశారు.

"భార్యలందర్నీ సమంగా చూడాలన్న సదుద్దేశంతో రాజుగారు వారంలో ఒక్కొక్క రోజునూ ఒక్కొక్క రాణికి పంచిపెట్టాడు. ఏ రోజు ఏ రాణి వంతైతే ఆ రోజు ఆ రాణితో గడుపుతాడన్నమాట!"

స్నేహితుల ముఖాల్లో తన్మయత్వం కనిపించింది.

"ఒక రోజు సాయంకాలం రాజుగారు రాచకార్యాలన్నీ పూర్తి చేసుకుని వుద్యానవనంలో కూచుని వున్నాడు. ఆయన దగ్గర శృంగారవిషయాల్లో సలహాలిచ్చే నర్మసచివుడున్నాడు. ఆ సమయంలో ఒక దాసి వచ్చి ఆయనకు నమస్కరించి నిల్చున్నది.

"రాజు విషయమేమిటన్నట్లుగా ఆమె వైపు చూశాడు.

"మహారాజా! కుంతల రాజకుమార్తె ఋతుస్నానం చేసి వున్నారు. తమకు విన్నవించమన్నారు."

"ఋతుస్నానానంతరం స్త్రీలో కోరిక తారస్థాయిలో వుంటుంది. 'ఈ రాత్రి ఆనందంగా గడుస్తుంది' అనుకున్నాడు రాజు.

"రాజు మనోభావాలు గమనించిన నర్మసచివుడు, "రాజా! ఈ వేళ అంగరాజకుమార్తె వంతు కదా!" అన్నాడు.

"ఇద్దరు భార్యల్లో యెవరి దగ్గరికి వెళ్లాలిఅని ఆలోచిస్తున్న సమయంలో ఆయనకు అంతకు ముందు రోజు సంఘటన జ్ఞాపకం వచ్చింది. ముందు రోజు ఆయన చిన్న భార్య కమలతో జూదమాడాడు. జూదంలో ఓడిపోతే ఈ రాత్రి తనతో గడపాలని పందెం కట్టి కమల జూదంలో గెలిచింది. కాబట్టి కమల మందిరానికి వెళ్లాలి.

"మహారాజు అలా ఆలోచిస్తుండగా నర్మసచివుడు యింకో విషయం జ్ఞాపకం చేశాడు "రాజా! పట్టమహిషిని ప్రసన్నురాలిని చేసుకోవాలి."

"రాజు వులిక్కిపడ్డాడు. యుద్ధంలో గెలిచి తీసుకువచ్చిన రత్నహారాన్ని రాజనర్తకికి యిచ్చినందు వల్ల పట్టమహిషి అలిగింది. ఆమె అలక తీర్చాలి.

"ఇలా నలుగురు రాణుల గురించీ ఆలోచిస్తున్న రాజు కదలకుండా ప్రతిమలా వుండిపోయాడు."

నేను ఆపెయ్యటంతో మిత్రుల ముఖాల్లో నిరాశ కనిపించింది.

"ఏమిటీ, కథ అయిపోయిందా?" విశ్వనాథ్ అడిగాడు.

"అసలు కథ యిప్పుడే మొదలవుతుంది. ఇప్పుడు నేను ఒక ప్రశ్న అడుగుతాను. మీరు సమాధానం చెప్పండి."

"చెప్పకపోతే తల పగిలిపోతుందా?" విశాల్ అన్నాడు.

"సమాధానం చెప్పకపోతే తల పగిలిపోడానికి నేను బేతాళుణ్నీ కాను, నువ్వు విక్రమార్కుడివీ కావు. రాజుగారు ఏ రాణి దగ్గరికి వెళ్లాలని మీరు అనుకుంటున్నారు?"

కామేశ్ ముందుగా జవాబు చెప్పాడు "కుంతల రాజకుమార్తె ఋతుస్నానం చేసి కోరికతో రగిలిపోతోంది కదా! ఆవిడ దగ్గరికి వెళ్లడమే హాయి!"

కామేశ్ రసికుడు. అతని సమాధానం అతని రసికత్వాన్ని చాటిచెప్తోంది.

"ఆనందమొక్కటేనా చూసుకోడం? న్యాయం, ధర్మం చూడాలి. ముందు రోజు చిన్న భార్య కమలతో ఒక ఒప్పందానికి వచ్చాడు. ఆ ఒప్పందానికి కట్టుబడి వుండాలి. రాజు కమల యింటికి వెళ్లడమే రైటు!" అన్నాడు విశాల్.

విశాల్ గవర్నమెంటులో ఆఫీసరు. ప్రతి ఫైలునూ పరిశీలించి, ఫైల్లో ప్రతి నోటింగ్‌నూ గమనించి కానీ నిర్ణయాలు తీసుకోడతను. గవర్నమెంటు మాన్యువల్స్ అతనికి కంఠోపాఠం.

లాయర్ విశ్వనాథ్, విశాల్ వాదాన్ని ఒప్పుకోలేదు. "ముందుగా అంగరాజకుమార్తెకు అలాట్ అయిన వారాన్ని పణంగా పెట్టి చిన్న భార్యతో జూదమాడటాని రాజుగారికి హక్కు లేదు. ఆ జూదంలో పెట్టుకున్న షరతు నల్ అంటే వాయిడ్ అవుతుంది. ముందు జరిగిన అలాట్‌మెంట్ ప్రకారం అంగరాజకుమార్తెదే ఆ రాత్రి హక్కు."

"విల్లులు తిరిగి రాయరా?"

"మరణానంతరం హక్కు లభించే విల్లును తిరిగి రాసే హక్కు వుంటుంది. ఆల్రెడీ యిచ్చేసిన దాన్ని తిరిగి తీసుకుని యింకొకళ్లకు యిచ్చేహక్కు వుండదు" అన్నాడు విశ్వనాథ్.

"లా ఏముందిలే? ఎలా కావలిస్తే అలా భాష్యం చెప్పుకోవచ్చు. రూల్స్ మనకు కావలసినట్లు యింటర్‌ప్రెట్ చేసుకోవచ్చు. రాజుగారు ఆనందం ముఖ్యమనుకుని కుంతల రాజకుమార్తె దగ్గరికి వెళ్లదలచుకుంటే రూల్స్ అడ్డుకోలేవు"అన్నాడు కామేశ్.

ముగ్గురికీ మధ్య గొడవ మొదలైంది. వాదోపవాదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి.

నేను లోకేశ్‌తో "నువ్వు మాట్లాడలేదేమిటి? నీ వుద్దేశంలో యెవరి దగ్గరికి వెళ్లాలి?" అన్నాను.

"బతికుంటే బలుసాకు తినచ్చని సామెత. సాధారణంగా పట్టమహిషి అంటే ఏ చక్రవర్తి కూతురో అయ్యుంటుంది. తన కూతురికి కోపం వచ్చిందంటే చక్రవర్తి వూరుకోడు. తల తీయించినా ఆశ్చర్యం లేదు. కాబట్టి పట్టమహిషి దగ్గరికి వెళ్లడమే శ్రేయస్కరం"అన్నాడు లోకేశ్.

"నీ వాదం తప్పు. పట్టమహిషి అంటే పెద్దమనసుదై వుంటుంది. ఆమెకు ఎప్పుడైనా సర్ది చెప్పచ్చు" అన్నాడు కామేశ్.

మళ్లీ వాదోపవాదాలు మొదలయ్యాయి.

"ఇంతకూ యీ కథ చెప్పిన వాడివి, నీ అభిప్రాయం చెప్పవేం?" అడిగాడు విశ్వనాథ్.

"నాకు సరైన సమాధానం తెలిస్తే మిమ్మల్ని ఎందుకు అడుగుతాను? ఈ నలుగురినీ వదిలేసి యింకొకళ్ల దగ్గరికి వెడితే...?"

"మిగిలిన వాళ్లింకా ముగ్గురున్నారు కదా. సమాధానం దొరకదు."

"ఆ జగన్నాటకసూత్రధారి శ్రీకృష్ణుడిలా అందరినీ అలరించగలిగితే యెంత బాగుంటుందో!"

అన్నాడు కామేశ్ తన్మయత్వంతో.

అతని తన్మయత్వం అందరికీ వ్యాపించింది. విశాల్ "రాజుగారు యెంత అదృష్టవంతుడో! మనం వొక్కళ్లతోనే సరిపెట్టుకుని, ఆ వొక్కళ్ల మూడ్‌ను బట్టి మన మూడ్‌ను మార్చుకుంటూ బతికేస్తున్నాం. రాజుగారికి హాయి. చక్కగా ఛాయిస్ వుంది. ఆయన మూడ్‌ను బట్టి యెవరినో వొకరిని యేరుకోవచ్చు" అన్నాడు.

లోపల అలికిడైంది. శ్రీమతి నిద్ర లేచినట్లుంది. కాఫీ కోసం అందరం లోపలి గుమ్మం వైపు ఆశగా చూడసాగాం. శ్రీమతి వచ్చి తలుపు దగ్గర నిల్చుంది. ఆమె ముఖం చూస్తే మా మాటలు విన్నట్లే వుంది.

"ఏడుగురు భార్యలూ, ఏరుకునే ఛాయిసూ కావాలా?"

మేం నోరెత్తలేదు.

నా స్నేహితులతో కూడా పరిచయమున్న శ్రీమతి దులిపి పారేసింది. "ఇదే మాట మేం అంటే ఏం చేస్తారు? ఏడుగురు భర్తలూ, ఏరుకునే ఛాయిస్ కావాలని మాకుండకూడదా? బహుభార్యాత్వం నేరమని తెలియదా? మాట్లాడుకుందుకు యింకేం లేవా?"

శ్రీమతి వాగ్ప్రవాహానికి అడ్డు వస్తూ," మా సంగతి కాదు. నేను చదివిన పద్యంలోని కథ చెప్పానంతే! ఇది యెప్పటిదో రాజుల కథ" అన్నాను.

"మన రాజులలా వున్నారు కాబట్టే మన దేశం విదేశీయుల పాలనలో మగ్గిపోయింది. ఒక్కొక్క రాజుకూ మూడు వందలమంది పెళ్లాలూ, మూడు వేలమంది ప్రేయసులూ. ఎంత మంది స్త్రీలుంటే అంత గొప్ప! ఆదిల్ ఖాన్‌ను గెలవటం కన్నా ఆడదాన్ని గెలవటం గొప్ప! అందుకే దేశమలా తగలడింది!"

మేము మాట్లాడలేదు.

"ఆ రాజులకు మీరేం తీసిపోయారు? రాజుగారు యే రాణి దగ్గరికి వెడితే బావుంటుందో అని ధర్మాధర్మవిచారణ చెయ్యకపోతే యేదైనా మంచి విషయం మాట్లాడుకోలేరా?"

శ్రీమతి విసురుగా లోపలికి వెళ్లిపోయింది. మేము మౌనంగా వుండిపోయాం. నాప్రశ్నకు సమాధానం దొరకలేదు. ఈ కథ చదివిన పాఠకులైనా చెప్తారేమోనని నా ఆశ!

■

# రింగ్ రింగ్ రింగేలా?











రకరకాల నగలు ధరించటం మనకు అనూచానంగా వస్తున్న ఆచారం. మెడకు హారాలు, చేతులకు గాజులు, వంకీలు, కంకణాలు, బాజూబందులు; నడుముకు ఒడ్డాణాలు-యిలా అనేకం వుంటాయి. చేతులకు గాజులతోపాటు ఉంగరాలు పెట్టుకోవటం కూడా వుంది. ఆ వుంగరాలను కలుపుతూ సన్నని గొలుసులు కూడా పెట్టుకుంటారు నర్తకీమణులు. ఉంగరాలు లేకుండా అసలు చేతులకు అందమే లేదనేవారూ వున్నారు. మన చేతి వేళ్లకున్న పేర్లను చెప్పుకుంటూ నాలుగవ వేలికి 'ఉంగరపు వేలు' అని వ్యవహరించటం కద్దు. ప్రత్యేకంగా ఆ వేలికే వుంగరాలు పెట్టుకోవటం మేలని పెద్దల నమ్మకం.

మామూలుగా వుంగరాలు పెట్టుకోవటం యెలా వున్నా పెళ్లికి ప్రధానం వుంగరం పెట్టటం మనకు చాలా ముఖ్యమైన సంప్రదాయం. పెళ్లికే దీన్ని యెందుకు ప్రత్యేకించి నియమించారో కూడా చాలా మందికి తెలిసివుండకపోవచ్చు. అసలీ ఆనవాయితీ యెలా, యెప్పుడు, యెక్కడ మొట్టమొదట ప్రారంభమైందో చెప్పలేము.

వలయాకారంలో వుండటం వల్ల ధరించటం సులువు కావటం వుంగరాలు పెట్టుకోటానికి వొక కారణం కావచ్చు. వలయం జీవితం సంపూర్ణత్వానికి ఓ చిహ్నం. వివాహవిషయంలో ఒక వ్యక్తికి మరో వ్యక్తి లేక సంపూర్ణత యేర్పడదు కనుకా, యిద్దరూ కలిస్తే అసంపూర్ణత్వం పోతుంది కనుకా యిది చిహ్నమై వుండవచ్చు. ఇద్దరికీ వివాహం కావటం వల్ల రెండు అర్ధచంద్రాకారాలు కలిసి, నిండు చందురుడైనట్లు-దానికి ఈ వుంగరంప్రతీక!

యుద్ధాల్లో జయించిన ప్రాంతాలకు చెందిన స్త్రీల చేతులకు గొలుసును వేసి వుంచి, వారిని తమ సొంతం చేసుకోటం ఆదిమకాలంలోని అలవాటు.క్రమంగా అది ఆ గొలుసును చేతికో, కాలికో తొడగటంగా మారింది. దానికి అర్థం ఆ తెగలోని ఓ మనిషికి ఆస్త్రీ సొంతమని. అది కాలక్రమేణా వేలికి వుంగరం తొడగటంగా మారిందని అంటారు. ఆ కాలంలో మనిషి మంత్రతంత్రాలను నమ్మేవాడు. ఓ తాడును అల్లి, తను కోరుకున్న స్త్రీ నడుముకు దాన్ని కట్టేవాడు. అలా కట్టటం వల్ల ఆ స్త్రీ ఆత్మశక్తి తనలో కలిసిపోతుందనీ, ఆమె శాశ్వతంగా తన సొత్తయిందనీ అతని భావం. ఒక రకంగా యిలాగే 'పెళ్లి వుంగరం'కథ మొదలైందని కొందరంటారు.

వివాహసమయంలో అంగుళీయకం ధరించటం మొట్టమొదట ఈజిప్పు వారి ఆచారం. వారి చిత్రలిపిలో వలయం పవిత్రతకు చిహ్నం. ఉంగరం వివాహానికి ప్రతీక. క్రీ.పూ. 900 ప్రాంతంలో క్రైస్తవులు యీ పద్ధతిని ఆచరించటం ప్రారంభించారు.

ఎడమచేతి అనామికకే వుంగరాన్ని యెందుకు పెట్టుకోవాలి? ప్రాచీన గ్రీసు ప్రజలు ఆ వేలిలోని నరం సరాసరి గుండెకు వెళ్తుందని నమ్మేవారు. నిజానికి యిది తక్కిన వేళ్ల కంటే చిన్నదిగా వుంటుంది కనుకా, వుంగరం పెట్టుకోవటానికి వీలుగా వుంది కనుకా యీ వేలికి వుంగరం తొడుగుతారు.

ఈ వుంగరాలు ధరించటం నేడు ఫ్యాషన్‌గా మారింది. నవరత్నాలు తాపిన వుంగరాలు ధరించటం వల్ల నవగ్రహాల అనుగ్రహానికి పాత్రులమవుతామని మనవారి విశ్వాసం. జాతకాలు చూపించుకుని, తమ తమ దోషాల పరిహారార్థం నవరత్నాల్లో కొన్నింటిని ధరిస్తున్నారు. వీటిని పెట్టుకోవటంలో ఆరోగ్యరహస్యమూ వుందని వైద్యులు చెబుతుండటం వల్లా నేడు వుంగరాలు చాలా ప్రాచుర్యంలో వున్నాయి.

రజని